సాక్షి

ఖమ్మం

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



పతనమవుతున్న పత్తి ధర

మద్దతు ధర కంటే ఎక్కువ లభిస్తుండడంతో రైతులు ఆనందలించేలోగానే పత్తి ధర పడిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. 10లో



భాగస్వాముల ఆరోగ్యంపై శ్రద్ధ

ఇన్నాళ్లు ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేయించిన యాజమాన్యం ఇప్పుడు వారి భాగస్వాములకూ పరీక్షలు చేయిస్తోంది. 12లో



వాతావరణం

జిల్లాలో శనివారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డెయిరీ ప్రతిపాదిత స్థలం పరిశీలన



స్థలం వివరాలు ఆరా తీస్తున్న డీఆర్‌డీఓ

బోనకల్/చింతకాని: బోనకల్‌లో ఇందిరా డెయిరీ భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని డీఆర్‌డీఓ సన్యాసయ్య శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్థలం వివరాలపై ఆయన అధికారులతో చర్చించారు. అలాగే, డెయిరీలో సభ్యుల వివరాలు, ఇతరత్రా అంశాలపై ఆరా తీసిన ఆయన డెయిరీ ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అలాగే, చింతకాని మండలం జగన్నాధపురంలో పాల శీతలీకరణ కేంద్రం నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని కూడా డీఆర్‌డీఓ పరిశీలించారు. స్థల సేకరణ పూర్తి కాగానే నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఎంపీడీఓ రామయ్య, డీపీఎం రేవతి, ఇందిరా డెయిరీ ఏపీఎం లక్ష్మణ్‌రావు, ఏపీఎం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందాలి

పెనుబల్లి: ఎక్కువగా పేద, మధ్యతరగతి వర్గాల వారు వచ్చే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. పెనుబల్లిలోని సీహెచ్‌సీ, లంకాసాగర్ పీహెచ్‌సీలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మొదట పెనుబల్లి సీహెచ్‌సీకి వచ్చిన ఆమె పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. కాగా, తరచుగా రక్త పరీక్షల కోసం బయటకు ఎందుకు పంపిస్తున్నారని వైద్యులను ప్రశ్నించారు. ఇకపై రక్త పరీక్షలు లంకాసాగర్ పీహెచ్‌సీలో లేదా ఖమ్మం హబ్‌లో చేయిస్తూ ప్రజలపై భారం పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం లంకాసాగర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు కిరణ్, సిబ్బంది సేవలపై అభినందించారు. ఎంపీడీఓ అన్నపూర్ణ, వైద్యులు రంజిత్‌కుమార్, విజ్ఞ, పంచాయతీ కార్యదర్శి ముస్తఫా పాల్గొన్నారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

కూసుమంచి: మండలంలోని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో సిరిసిల్ల జిల్లా మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ ఈసందర్భంగా సూర్యాపేట జిల్లా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.లవకుమార్, పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. చేపల పెంపకం, మేత తదితర అంశాలపై అవగాహన పెంచుకుంటేనే లాభదాయక దిగుబడులు వస్తాయని తెలిపారు. రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ ద్వారా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఆతర్వాత మత్స్య శాస్త్రవేత్తలు రవీందర్, గణేష్, మోతె వెటర్నరీ అసిస్టెంట్ మమత మాట్లాడగా మత్స్యకారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పల్లెలు కళకళలాడాలి



బౌద్ధక్షేత్రం వద్ద శుభ్రం చేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షరైనా, ఉద్యోగులు

నేలకొండపల్లి: ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే పల్లెలన్నీ కళకళలాడతాయని జెడ్పీ సీఈఓ దీక్షారైనా తెలిపారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం వద్ద స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె సిబ్బందితో కలిసి చెత్త తొలగించారు. అలాగే, మొక్కలు నాటాక ఆమె మాట్లా డారు. జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఎంపీడీఓ ఎర్రయ్య, ఎంపీఓ శివ, ఎంఈఓ చలపతిరావు, ఉద్యోగులు సునీత, అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురం.. మున్సిపాలిటీ!

జిల్లాలో ఏదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది. ఈ ప్రాంతంలో అభివృద్ధి, వసతుల కల్పన నేపథ్యాన మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని కొన్నాళ్ల క్రితం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపాలిటీ ఏర్పాటుకు అవకాశాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కలెక్టర్‌ను ఆదేశించింది. ఈమేరకు పూర్తిస్థాయిలో సర్వే చేయించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నివేదిక పంపంపించారు. ఖమ్మం రూరల్ మండలంలోని 12 గ్రామపంచాయతీలను కలుపుతూ ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుకు అనువుగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఏదులాపురం మున్సిపాలిటీ ప్రతిపాదిత మ్యాప్



జిల్లాలో నాలుగో మున్సిపాలిటీ ఏర్పాటుకు అడుగులు

- గతంలోనే సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి పొంగులేటి
- ప్రభుత్వ సూచనలతో నివేదిక పంపించిన కలెక్టర్
- ఖమ్మం రూరల్ మండలంలోని 12 జీపీలతో ఏర్పాటుకు ప్రణాళిక
- పట్టణీకరణ దిశగా దూసుకెళ్లనున్న ఖమ్మం రూరల్ ప్రాంతం



ఏదులాపురం గ్రామం వ్యూ

పట్టణీకరణ వైపుగా..

జిల్లాలో ఖమ్మం నగరానికి ఖమ్మం రూరల్ మండలం ఆనుకునే ఉంటుంది. మండలం పట్టణీకరణ వైపు దూసుకెళ్తూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు కాగా, గ్రానైట్ పరిశ్రమలు, ఇంజనీరింగ్ తదితర విద్యాసంస్థలు ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా పది జీపీల్లో అభివృద్ధి పరంగా స్పష్టమైన మార్పు నమోదైంది. బారుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, చినవెంకటగిరి, ఏదులాపురం, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, పోలేపల్లి గ్రామ పంచాయతీలు గ్రామ స్థాయి నుంచి పట్టణీకరణ దిశగా దూసుకెళ్తున్నాయి. ఈ పది జీపీలకు తోడు మరో రెండు కలిపి ఏదులాపురం మున్సిపాలిటీగా ప్రతిపాదించారు.

తొలుత పెద్దతండా అనుకున్నా..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరులో నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్ మండలంలో పర్యటించిన సమయాన స్థానికులు మున్సిపాలిటీ ఏర్పాటుపై విన్నవించారు. అయితే గతంలో తొమ్మిది గ్రామపంచాయతీలతో కలిపి పెద్దతండా కేంద్రంగా మున్సిపాలిటీపై ప్రతిపాదనలకు రూపొందించారు. ఆతర్వాత అన్ని అంశాలను బేరీజు వేసుకుని ఏదులాపురంను మున్సిపాలిటీ చేస్తే బాగుటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. ఈ అంశంపై సర్వే చేసి రూపొందించిన నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపించారు.

గ్రామపంచాయతీల వారీగా జనాభా, విస్తీర్ణం (చ.కి.మీ.ల్లో)

గ్రామపంచాయతీ	జనాభా	విస్తీర్ణం
బారుగూడెం	2,351	2.63
చిన్నవెంకటగిరి	5,292	7.45
ఏదులాపురం	11,401	6.1
గొల్లగూడెం	1,716	3.44
గుదిమళ్ల	4,227	9.49
గుర్రాలపాడు	2,182	5.94
మద్దులపల్లి	3,481	6.031
ముత్తగూడెం	3,153	4.89
పెద్దతండా	15,503	5.08
పోలేపల్లి (కొంత)	3,604	6.22
పల్లెగూడెం (కొంత)	835	2.82
తెల్దారుపల్లి	4,902	9.68
మొత్తం	58,647	69.771

12 గ్రామపంచాయతీల వివరాలు

జనాభా	58,647
ఓటర్లు	43,874
విస్తీర్ణం	69.771 చ.కి.మీ.
గృహాలు	18,937
ఆస్తి పన్ను డిమాండ్	రూ.5,83,44,529
వ్యవసాయాధారిత కుటుంబాలు	4,849
వ్యవసాయభూమి	10,779 ఎకరాలు

● ఏదులాపురం అయితేనే...

మున్సిపాలిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో ఖమ్మంరూరల్ ఎంపీడీఓ నేతృత్వాన సర్వే చేశారు. ఈక్రమంలోనే పెద్దతండా కేంద్రంగా కన్నా ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చి నివేదిక రూపొందించారు. బారుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, చిన్న వెంకటగిరి, ఏదులాపురం, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, తెల్దారుపల్లి గ్రామపంచాయతీలు పూర్తిగా, పోలేపల్లి, పల్లెగూడెంలో కొంత భాగం చొప్పున కలిపి ఏదులాపురం మున్సిపాలిటీ చేయాలని నివేదికలో పేర్కొన్నారు.

● ఇప్పటికే మూడు..

కలెక్టర్ పంపిన నివేదిక పరిశీలన అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. జిల్లాలో సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు ఉండగా నాలుగో మున్సిపాలిటీగా ఏదులాపురం ఏర్పాటవుతుంది. ఆపై 12 గ్రామపంచాయతీల ప్రజలకు మున్సిపల్ చట్టం నిబంధనల మేరకు వసతులు అందుబాటులోకి వస్తాయి.

విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు రెడీ

- ప్రస్తుత స్థానంలో రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి స్థానచలనం
- డివిజన్, సర్కిల్, కార్పొరేట్ కార్యాలయం స్థాయిలో బదిలీలు
- వచ్చేనెల 7నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు టీజీఎస్పీడీసీఎల్ శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి పనిచేస్తున్న స్థానంలో రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని బదిలీకి అర్హులుగా నిర్ధారించారు. అయితే, ప్రతీ కేడర్‌లో 50శాతానికి తగ్గకుండా బదిలీలు చేపడుతారు. ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్(ఓ అండ్ ఎం)లో పనిచేసే ఉద్యోగుల(ఎల్‌ఐ వరకు)ను డివిజనల్ స్థాయిలో, సబ్ ఇంజనీర్లు, అకౌంట్స్, ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు, సిబ్బందిని సూపరింటెండెంట్ ఇంజనీర్ బదిలీ చేయనున్నారు.ఇక ఏఈ, ఏఏఈ, ఏడీఈ ఆపైన, జేఏఓల నుంచి ఆపై స్థాయి అధికారుల బదిలీల ప్రక్రియను కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తారు.

వారికి మినహాయింపు

వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులు కోరుకుంటేనే బదిలీ చేయనుండగా, ఆప్షన్ ఇవ్వకపోతే మినహాయిస్తారు. అలాగే, ఉద్యోగులు ప్రాధాన్యత స్థానాలను పోర్టల్‌లో పొందుపర్చే అవకాశం కల్పించారు. ఇక యూనియన్ ప్రతినిధులకు గతంలో మాదిరిగానే బదిలీల నుంచి రక్షణ కల్పించే విధానం కొనసాగిస్తారు. భార్యాభర్తలు, ఏడాది కాలంలో ఉద్యోగ విరమణ పొందే వారితో పాటు 70 శాతం వైకల్యం కలిగిన ఉద్యోగులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలు ఉన్న వారు, వితంతువులు, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు.

నేటి నుంచి ప్రారంభం

కార్పొరేట్, సర్కిల్, డివిజన్ స్థాయిలో బదిలీ షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. సంస్థ విడుదల చేసిన మార్గదర్శకాల ఆధారంగా శనివారం బదిలీకి అర్హులైన ఉద్యోగుల జాబితాలను పోర్టల్‌లో పొందుపర్చడంతో కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీ వరకు వెల్లడించవచ్చు. ఆపై అర్హులైన ఉద్యోగులు సంబంధిత ధ్రువపత్రాలతో అక్టోబర్ 4 వరకు ప్రాధాన్యత స్థానాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అక్టోబర్ 7నాటికి బదిలీ ఉత్తర్వులు జారీ చేయనుండగా, అక్టోబర్ 9 నాటికి బదిలీ అయిన అధికారులు, ఉద్యోగులు రిలీవ్ కావాలి. అయితే, అక్టోబర్ 8నుంచే తిరిగి బదిలీల నిషేధం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్‌తో పాటు ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి, ఎంఆర్‌టీ డివిజన్లలో ఉద్యోగులు బదిలీల ప్రక్రియకు సిద్ధమవుతుండగా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమకు సౌకర్యవంతమైన పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

ఇంకొన్ని మిల్లులదీ అదేదారి..

- సీఎంఆర్ ఇవ్వని మరో నాలుగు మిల్లులు
- రబీ సీఎంఆర్‌కు ఇవ్వడానికి మరో రెండు నెలల గడువు
- కొంత నగదు చెల్లించిన రెండు మిల్లుల యాజమాన్యాలు
- ఇన్నాళ్లు పట్టించుకోని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కొణిజర్ల మండలం లాలాపురంలోని ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లు దారిలోనే జిల్లాలోని మరికొన్ని మిల్లులు ధాన్యంను స్వాహా చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన పౌర సరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలకు ఉపక్రమించిన క్రమాన అక్రమాలు బయటపడుతున్నాయి. దీంతో బెంబేలెత్తుతున్న యాజమాన్యాలు ధాన్యానికి సంబంధించి డబ్బు చెల్లిస్తామని చెబుతున్నట్లు సమాచారం. మరోవైపు మిల్లర్లు ధాన్యం పక్కదారి పట్టించిన ఘటనలో పౌర సరఫరాల సంస్థకు చెందిన కొందరు అధికారుల ప్రమేయాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

రెండు నెలలు గడువు

జిల్లాలో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి ఐదు మిల్లులు అతి తక్కువ సీఎంఆర్ చెల్లించడంతో పౌర సరఫరాల సంస్థ దృష్టి సారించింది. ఇప్పటికే ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో తనిఖీలు చేపట్టగా రూ.81.60 కోట్ల మేరకు అవకతవకలు బయటపడ్డాయి. ఇక రబీకి సంబంధించి మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడంతో అందుకు సంబంధించిన నగదు చెల్లించేందుకు గడువు కావాలని ఇంకో రెండు మిల్లుల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. మరో రెండు మిల్లుల తరఫున కొంత నగదు చెల్లించినట్లు తెలిసింది. ఓ మిల్లు రూ.9 కోట్ల వరకు బకాయి ఉండగా రూ.కోటి, మరో మిల్లు రూ.5 కోట్లలో రూ.40 లక్షల వరకు చెల్లించి గడువు కోరినట్లు సమాచారం. రబీకి సంబంధించి ధాన్యం లేకపోవడంతో ఐదు మిల్లుల నుంచి రూ.100 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించగా వారి విజ్ఞప్తితో రెండు నెలల గడువు ఇచ్చారు.

21,823.272 క్వింటాళ్ల బాకీ

2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిల్లర్ల నుంచి 21,823.272 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందాల్సి ఉంది. పౌర సరఫరాల సంస్థ నుంచి 1,20,533.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించగా మొత్తం 80,903.062 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాలి. ఇందులో 59,079.790 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చారు. ఇందులో ఐదు మిల్లుల నుంచి అతితక్కువ సీఎంఆర్ రావడం, ధాన్యం నిల్వలు కూడా లేకపోవడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. జిల్లాలో ఇప్పటివరకు 73 శాతం సీఎంఆర్ నమోదైనా, కొన్ని మిల్లులు అతితక్కువ స్థాయిలో చెల్లించడంతో మిగతా ధాన్యానికి సంబంధించి నగదు వసూళ్లకు జిల్లా అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యాన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తాజాగా రైస్‌మిల్లర్లతో సమావేశమై సీఎంఆర్ అందజేయాలని ఆదేశించి అనధికారికంగా రెండు నెలలు గడువు ఇచ్చినట్లు తెలిసింది.

ముగ్గురు అధికారులదే ప్రధానపాత్ర

జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనక ముగ్గురు అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. 2022–23 రబీ, 2023–24 ఖరీఫ్ సీఎంఆర్‌ను ఇవ్వని మిల్లర్లకు అధికారులతో ఉన్న సత్సంబంధాలు ఉపయోగిపడినట్లు తెలుస్తోంది. పౌర సరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టిన సమయాన ఈ విషయాన్ని గుర్తించారని సమాచారం. ఆయా మిల్లుల యజమానుల నుంచి భారీ స్థాయిలో ముడుపులు అందడంతోనే అధికారులు సీఎంఆర్ విషయమై చూసీ చూడనట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

సీఎంఆర్ వ్యవహారానికి సంబంధించి అధికారులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టాస్క్‌ఫోర్స్ తనిఖీల నేపథ్యాన కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై సీఎంఆర్ విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించినట్లు తెలిసింది. భారీగా బకాయి ఉన్నప్పటికీ ఏం చేస్తున్నారని ప్రశ్నించినట్లు సమాచారం. మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నిల్వలపై ఆరా తీయాల్సి ఉండగా పట్టించుకోకపోవడం సరికాదని, ఇక నుంచి విధులు సక్రమంగా నిర్వర్తించాలని హెచ్చరించినట్లు తెలిసింది.

పొంగులేటి ఇంటిపై రైడ్స్‌తో మాకేం సంబంధం?

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఈడీ దాడులతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొంగులేటి బీజేపీలోకి రాలేదని ఈడీ దాడులు జరగడం లేదని చెప్పారు. గతంలో సోనియా, రాహుల్ గాంధీపై ఇళ్లపై కూడా దాడులు జరిగాయని, వాళ్లను పార్టీలో చేరమని ఒత్తిడి చేయలేదుగా అని ప్రశ్నించారు. కాగా, రాష్ట్రంలో హైడ్రాను తాను స్వాగతిస్తున్నానని.. ఒకవేళ తమ పార్టీ హైడ్రాపై స్టాండ్ మారిస్తే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ మద్యం పాలసీపై విమర్శలు చేసిన కాంగ్రెస్ అదే విధానాన్ని కొనసాగిస్తోందని రఘునందన్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లో మద్యం షాపులు తెరిచే సమయం పొడిగించి ఖజానాకు ఆదాయం పెంచుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఆపై ట్రాఫిక్ పోలీసులు పంపించి దోచుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాగా, అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి వస్తానంటే బీజేపీ అడ్డుకోలేదని తెలిపారు. అన్య మతస్తులు టీటీడీలో డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు శ్యాంరాథోడ్, దొంగల సత్యనారాయణ, అల్లిక అంజయ్య, ఉపేందర్‌రావు, మందా సరస్వతి, విజయారెడ్డి, చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘం సభ్యుడిగా ఎంపీ వద్దిరాజు



వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుడిగా రెండోసారి నియమితులయ్యారు. ఈమేరకు పార్లమెంట్ నుంచి వివిధ శాఖల స్థాయీ సంఘాలకు సభ్యులను నియమిస్తూ గురువారం ప్రకటన విడుదలైంది. ఎంపీ రవిచంద్ర తొలిసారి రాజ్యసభకు ఎన్నికైప్పుడు కూడా ఇదే స్థాయీ సంఘం సభ్యులుగా నియమితులయ్యారు. తిరిగి రెండోసారి ఎంపీగా ఎన్నికైన ఆయన మళ్లీ సభ్యుడిగా నియామకమయ్యారు.

మహనీయుల జీవితాల్లో విలువలు

బాపూజీ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మహనీయులు వారి జీవితాల్లో అనుసరించిన విలువలను ఈ తరం యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, డి.మధుసూదన్‌నాయక్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో మార్పు, అందరి అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని తెలిపారు. నలభై ఏళ్లపాటు ఎన్ని కష్టాలు ఎదురైనా పోరాటాన్ని విడిచిపెట్టలేదని చెప్పారు. విజయం రోజుల్లో రాదని.. ఓపికతో పోరాడితే ఫలితం ఉంటుందని ఆయన జీవితం ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, వివిధ సంఘాల నాయకులు బొమ్మ రాజేశ్వరరావు, పగడాల నాగరాజు, చిలకమర్రి శ్రీనివాసబాబు, అమరగాని వెంకటేశ్వర్లు, తాటి శ్రీనివాస్, పెండెం జనార్దన్, బండారు శ్రీను, పిండిప్రోలు రామ్మూర్తి, రచ్చ శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితుల పునరావాసానికి చర్యలు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల వచ్చిన వరదతో నష్టపోయిన వారి పునరావాసానికి ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి శుక్రవారం ఆయన ఖమ్మం డియోసెసన్ సోషల్ సర్వీస్ సొసైటీ(డీఎస్ఎస్ఎస్‌కే) బాధ్యులతో సమావేశమయ్యారు. వరద సహాయక చర్యల్లో తమ పాత్రను సొసైటీ బాధ్యులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పది వేల కుటుంబాలను ఆదుకునేందుకు తొలిదశగా సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నామన్నారు. ఆపై ప్రభుత్వ పథకాలల్లో ప్రాధాన్యత కల్పిస్తూ స్వయం ఉపాధి యూనిట్లు కేటాయిస్తామని తెలిపారు. సొసైటీ బాధ్యులు, ఖమ్మం మేత్రాసనం గురువులు సురేష్, అమల్, సెల్విన్, తప్పెట శౌరి, సుధాకర్, బత్తుల జయరాజు, ఐసక్, గోరంట్ల చార్లెస్ పాల్గొన్నారు.

30న డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన



ఖమ్మం సహకారనగర్: 2008 సంవత్సరం డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులను కాంట్రాక్ట్ విధానంలో నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లాలో 128 మంది మైదాన ప్రాంతం అభ్యర్థులు, 215మంది ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు అవకాశం లభించనుంది. కాగా, ఈనెల 30వ తేదీన ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్‌పై గెజిటెడ్ సంతకంతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం http:Vschooledu.telangana. gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని డీఈఓ తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



ఖమ్మం లీగల్: జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు తెలిపారు. ఖమ్మంలోని న్యాయ సేవా సదన్‌లో లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తిరాజగోపాల్ ప్రారంభిస్తారని వెల్లడించారు. కేసుల పరిష్కారానికి ఖమ్మం కోర్టులో ఎనిమిది బెంచ్‌లు ఏర్పాటు చేయగా, కక్షిదారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, చెక్కులతో పాటు మోటారు ప్రమాద కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

బావోజీ తండా వాసికి డాక్టరేట్


అంగోత్ లక్ష్మణ్

రఘునాథపాలెం: మండలంలోని బావోజీతండాకు చెందిన అంగోత్ లక్ష్మణ్‌కు డాక్టరేట్ లభించింది. తండాకు చెందిన అంగోత్ సాంబ్రయ్య – ద్వాలి కుమారుడైన లక్ష్మణ్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించగా డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ రామకృష్ణతో పాటు తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మారుమూల గిరిజన గ్రామానికి చెందిన లక్ష్మణ్ డాక్టరేట్ సాధించడంపై భూక్యా శ్రీనునాయక్, హరిదాస్, ఝాన్సీ తదితరులు అభినందించారు.

భగీరథ పైపులైన్ మరమ్మతులకు రూ.30లక్షలు

ఎర్రుపాలెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కట్లేరు ప్రవాహానికి మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బతిన్నాయి. వైరా నుండి మామునూరు పేట చెరువుకు నీరు పంపిణీ చేసే పైపులైన్ దెబ్బతినడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు స్థానికులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన మరమ్మతులకు రూ.30లక్షలు మంజూరు చేశారు. ఈమేరకు త్వరగా పనులు చేపట్టి నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు జరగనున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎన్.నర్సింహామూర్తి తెలిపారు. ఈనెల 29న అండర్–14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలతో పాటు బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇక 30న అండర్–14, 17 బాలికల ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు, అక్టోబర్ 1వ తేదీన బాలురకు ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జోన్ల వారీగా క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

భవన నిర్మాణ పనులు అడ్డగింత


స్లాబ్ సెంట్రింగ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతుండగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. ఖమ్మం 50వ డివిజన్‌లో అనుమతులు లేకుండా భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఉద్యోగులు ఇటీవల పరిశీలించి యజమానికి నోటీసులు ఇచ్చారు. అయినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తుండడంతో శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు అడ్డుకుని స్లాబ్ సెంట్రింగ్ కూల్చివేయించారు. అనుమతి తీసుకోకుండా నిర్మాణాల చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సరఫరాలో లోపాలు ఎదురుకావొద్దు


కొణిజర్లలో మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

కొణిజర్ల: గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేసేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఆశాలత సూచించారు. కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరంలో డీపీఓ మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ట్రైనర్ రమ నీటి నాణ్యత పరిశీలన, క్లోరినేషన్‌పై అవగాహన కల్పించగా, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, డీఈలు నర్సింహారావు, వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్, సురేష్ పాల్గొన్నారు.

వేంసూరు: ప్రతిఒక్కరు ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందని డీపీఓ ఆశాలత తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా వేంసూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శ్రమదానంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డీఎల్‌పీఓ రాంబాబుతో పాటు ఎంపీఓ రంజిత్‌కుమార్, అనూఫ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి: ఇటీవల పురుగులమందు తాగిన మండలంలోని రుక్కితండా గ్రామ పంచాయతీ పరిధి బండిపాడుకు చెందిన కురసం ఎర్రయ్య(50) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య నీలమ్మ పదేళ్లుగా ఎర్రయ్యకు దూరంగా ఉంటోంది. ఒంటరిగా జీవిస్తూ జీవాలు కాస్తూ బతుకుతున్న ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితం మీద విరక్తితో గురువారం పురుగుల మందు తాగగా స్థానికులు ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

పతనమవుతున్న పత్తి ధర

- వారంలోనే రూ.500కు పైగా దిగువకు..
- తేమ, నాణ్యత పేరిట వ్యాపారుల కొర్రీలు
- సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో ఇష్టారాజ్యం
- నేడు కలెక్టర్ అధ్యక్షతన జరిగే భేటీలో నిర్ణయం వెలువరించే అవకాశం


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తి ధర పెరుగుతుండడంతో రైతులను ఆశల పల్లకీలో విహరించినా ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. గత వారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో క్వింటాకు రూ.8,250, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.8,000 వరకు పలికిన పాత పత్తి ధర ప్రస్తుతం రూ. 7,500గా నమోదవుతోంది. అంటే వారం తిరగకుండానే క్వింటాకు ఏకంగా రూ.500కు పైగా ధర పతనమైంది. ఆగస్టు నెల చివరి వారం వరకు రూ. 7,600 వరకు ధర పలకగా, ఈ నెలారంభంలో భారీ వర్షాల నేపథ్యాన కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక 9వ తేదీ నుంచి పంట కొనుగోళ్లు ప్రారంభం కాగా, కేంద్రప్రభుత్వం నూనెల దిగుమతిపై సుంకం పెంచింది. ఆ ప్రభావం పత్తి గింజల ధర పెరుగుదలకు దోహపడింది. ఫలితంగా పంట ధర కూడా పెరిగినా మళ్లీ తగ్గుముఖం పట్టడం గమనార్హం.

నిలవని రైతుల ఆశలు

క్వింటా పత్తి ధర రూ.8 వేలకు చేరడంతో ఇళ్లలో నిల్వ చేసిన రైతులు అమ్మకాలు ప్రారంభించారు. ఈనెల 16 నుంచి 21 వరకు పాత పత్తి ధర రూ.7,900 నుంచి రూ.8వేల వరకు, కొత్త పత్తి ధర రూ.7,600 నుంచి రూ. 7,722గా నమోదైంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,521గా ప్రకటించింది. అంతకు మించి ధర వస్తుండడంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. కానీ వారం తిరగకుండానే పతనమవడం, శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌లో పాత పత్తికి గరిష్ఠంగా రూ.7,500గా, కొత్త పత్తి ధర రూ.7,011 పలికింది.

సాకులతో వ్యాపారుల మాయాజాలం

తేమ అధికంగా ఉందని, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాణ్యత కోల్పోయిందనే తదితర కారణాలతో పాటు అంతర్జాతీయంగా పత్తి ధర మందగించిందని చెబుతూ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు వ్యాపారులైతే పంట కొనుగోళ్లకు ఆసక్తి కనబర్చడం లేదు. నిత్యం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసే కొందరు వ్యాపారులు మూడు, నాలుగు రోజులుగా మార్కెట్ ముఖమే చూడడం లేదు. మిగిలిన వారు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సీసీఐ సెంటర్ల ఏర్పాటులో జాప్యం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. జిన్నింగ్ మిల్లులే కేంద్రాలుగా సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. ఆపై మిల్లుల యాజమాన్యాలు జిన్నింగ్ చేసి సీసీఐ సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఇదంతా టెండర్ల రూపంలో జరగాల్సి ఉండగా.. ఆంక్షలు తమకు సమ్మతంగా లేవంటూ యాజమానులు టెండర్లకు దూరంగా ఉన్నారు. ఈనెల 29 వరకు వ్యవహారం ఓ కొలిక్కి వస్తుందని సీసీఐ, ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోంది. సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో వ్యాపారులు ధర నిర్ణయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీసీఐ రంగంలోకి దిగితే తప్ప వ్యాపారులు ధర పెంచే అవకాశం కానరావడం లేదు.

ఖమ్మం మార్కెట్‌లో కొద్దిరోజులుగా పత్తి ధరలు (క్వింటాకు రూ.ల్లో)

తేదీ	పాత పత్తి	కొత్త పత్తి
సెప్టెంబర్ 18న	8,000	7,722
20న	7,900	7,611
23న	7,750	7,311
25న	7,600	7,211
26న	7,500	7,111
27న	7,500	7,011

నేడు పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ సమావేశం

సీసీఐ ఆధ్వర్యాన పత్తి కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం కానున్నారు. ఈసమావేశానికి హాజరుకావాలని ఇప్పటికే సీసీఐ ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్, అగ్నిమాపక, తూనికలు, కొలతలు, పోలీసు తదితర శాఖల అధికారులతో పాటు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలకు సమాచారం ఇచ్చారు. ఈ సమావేశంలో కేంద్రాల ఏర్పాటు, పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ సూచనలు చేసే అవకాశముంది.

నేడు జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మంఅర్బన్: 'ది ఖమ్మం గ్రానైట్ శ్లాబ్, ఫ్యాక్టరీల ఓనర్ల అసోసియేషన్' ఎన్నికలు శనివారం జరగనున్నాయి. అసోసియేషన్‌లో 444 మంది ఓటర్లు ఉండగా, ఏకగ్రీవానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పోలింగ్ అనివార్యమైంది. ఖమ్మంలోని హరిత గార్డెన్స్‌లో ఉదయం 9నుండి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఆతర్వాత ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారి ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటికే వైస్ ప్రెసిడెంట్–1, 2లుగా కొనకంచి శ్యాంప్రసాద్, తమ్మినేని సాగర్, జాయింట్ సెక్రటరీ–2గా చావా రామూర్తి, ఈసీ–2, 3, 5గా ఎం.అనిల్‌కుమార్, బి.లాలప్రతాప్, బి.రాజగోపాల్‌రెడ్డి ఏకగ్రీవమ్యారు. ఇక అధ్యక్ష స్థానానికి వేముల రవికుమార్, పాటిబండ్ల యుగంధర్, కార్యదర్శి పదవికి కమర్తపు గోపాలరావు, మంకెన శేఖర్, సంయుక్త కార్యదర్శి పదవి కోసం ఎస్.డీ.ఖాజా మెయినుద్దీన్, షేక్ రియాజ్, కోశాధికారిగా ఆకుల నాగేశ్వరరావు, ఎం.పరమేశ్వరరెడ్డి, ఈసీ–1 కోసం డి.స్వేధన్, కె.వెంకటేష్, ఈసీ–4 కోసం చెరుకూరి పూర్ణచంద్రరావు, పి.రవికుమార్ పోటీలో ఉన్నారు.

టీటీజీడీఏ కమిటీ ఎన్నిక

ఖమ్మంవైద్యవిభాగం: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) ఖమ్మం యూనిట్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కోట అశోక్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ సుధానందన్‌ను ఎన్నుకున్నారు. అలాగే, సంయుక్త కార్యదర్శిగా సందీప్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అపర్ణ, జె.తులసి, వెంకటేశ్వర్లుతో పాటు మరో ఎనిమిది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో టీటీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి. కిరణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశస్త యాప్‌లో దివ్యాంగుల వివరాలు

ఎర్రుపాలెం: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలను ప్రశస్త యాప్‌లో విధిగా నమోదు చేయాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ డి.రాజశేఖర్ సూచించారు. ఎర్రుపాలెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులైన పిల్లల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వచ్చే నెల 26వ తేదీలోగా ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, హెచ్‌ఎం జీవీఎస్.రాజు, రిసోర్స్ పర్సన్లు ఎస్.హన్మంతరావు, రవి, జ్యోతి, సరిత పాల్గొన్నారు.

రూ.31.40లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: జిల్లాలోని కూసుమంచి మండలం పాలేరుకు చెందిన వ్యాపారి తోడేటి వెంకన్న రూ.31.40 లక్షలకు గాను దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే వెంకన్న గ్రామాల్లో దుస్తులు అమ్మడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశాడు. ఈక్రమంలో పలువురి వద్ద అప్పులు చేయగా, ప్రస్తుతం తన ఆరోగ్యం దెబ్బతిన్నందున వ్యాపారం చేయలేని పరిస్థితుల్లో అప్పులు తీర్చ మార్గం లేదంటూ తన న్యాయవాది ద్వారా శుక్రవారం ఖమ్మం సబ్ కోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

పెరుగుతున్న 'ఉద్యోగ' బాధితులు

నకిలీ దంపతులు, డ్రైవర్‌ను విచారిస్తున్న ఏపీ పోలీసులు


ఉద్యోగాల పేరుతో వసూళ్లకు పాల్పడిన శశాంక, అనిల్, అనుదీప్

మధిర: ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామన్న నకిలీ దంపతులు, డ్రైవర్ మాటలు నమ్మి మోసపోయిన బాధితుల సంఖ్య పెరుగుతోంది. దంపతుల పేరిట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి మధిరలో మకాం వేసిన అనిల్ బాబు, శశాంక, వారి డ్రైవర్ అనుదీప్‌ను ఏపీ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని అక్కడకు తరలించి విచారిస్తున్నారు. కాగా, మధిరలోని టీచర్స్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు పలువురు ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామన్న మాటలు నమ్మి డబ్బులు చెల్లించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.3.50 లక్షలు, ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఎస్.కే.మస్తాన్ రూ.4.50 లక్షలు, సిరిపురానికి చెందిన అబ్దుల్ రహీం రూ.2.50 లక్షలు, రాయపట్నంకు చెందిన క్రాంతి రూ.45వేలు చెల్లించినట్లు తెలిసింది. కాగా, నకిలీ దంపతులు గతంలో కరీంనగర్ జిల్లాలోనూ వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. వీరు ఖరీదైన కార్లలో తిరుగుతుండడం, వాహనాలపై కేంద్రప్రభుత్వ స్టిక్కర్లు ఉండడంతో నమ్మామని బాధితులు చెబుతున్నారు. ఇటీవల టీచర్స్ కాలనీలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో దంపతులు పూజలు కూడా చేయడం గమనార్హం. కాగా, ప్రస్తుతం ఏపీలో కేసు దర్యాప్తు జరుగుతుండడంతో మధిర టౌన్ పోలీస్ స్టేషన్ కేసు నమోదుపై జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించగా త్వరలోనే కేసు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

సిరిపురం ఎస్‌బీఐలో చోరీకి యత్నం


బ్యాంక్‌లో పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్

మధిర: మధిరలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిరిపురం శాఖ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీకి యత్నం జరిగింది. కొందరు దుండగులు బ్యాంకు వెనక తలుపు తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ క్యాష్ కౌంటర్‌లో వెతికారు. అందులో నగదు లేకపోవడంతో స్ట్రాంగ్ రూమ్, లాకర్ల తాళాలు తెరిచేందుకు ప్రయత్నించారు. ఇవేవీ సాధ్యం కాకపోగా, ఇంతలోనే సైరన్ మోగడంతో దుండగులు పరారయ్యారు. ఈమేరకు శుక్రవారం ఉదయం చోరీ యత్నం జరిగినట్లు గుర్తించిన బ్యాంక్ మేనేజర్ ఉమేష్‌కుమార్ యాదవ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వైరా ఏసీపీ రెహమాన్ చేరుకుని క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేపట్టారు. కాగా, బ్యాంకులో నగదు, ఆభరణాలు ఏవీ చోరీకి గురికాలేదని మేనేజర్ ఉమేష్‌కుమార్ స్పష్టం చేశారు.

శ్రీరామ్ హిల్స్‌లోని రెండు ఇళ్లలో...

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని శ్రీరామ్ హిల్స్ కాలనీలో తాళం వేసిన రెండిళ్లలో చోరీ జరిగింది. ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాలు... కాలనీలో నివసించే కోలపుడి లత రాజకుమారి కొత్తగూడెంలోని కుమారుడి ఇంటికి, గాదె రాము బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి కాలనీ చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను కట్ చేసిన దుండగులు లోపలకు చేరుకుని ఇళ్ల తాళాలు పగలగొట్టారు. రాజకుమారి ఇంట్లో ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు, రాము ఇంట్లో ఆరు తులాలు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, సీఐ భానుప్రకాష్ పరిశీలించి క్లూస్ టీం ద్వారా దర్యాప్తు ప్రారంభించారు.

హుండీ ధ్వంసం, నగదు చోరీ

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం తెల్లవారుజామున హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయం ముందు ఉన్న హుండీని సమీప పొలాల వద్దకు తీసుకెళ్లాక పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉదయం స్థానికులు చుట్టుపక్కల వెతకగా పొలాల్లో పగులగొట్టిన హుండీ లభించింది. దీంతో పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

పలువురు ప్రయాణికులకు గాయాలు


ఘటనాస్థలంలో లారీ, ట్రావెల్స్ బస్సు

పెనుబల్లి: పెనుబల్లి మండలం సీతారాంపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపు ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీని హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్తున్న జీవీఆర్ ట్రావెల్స్ బస్సు వెనుక నుండి ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా బస్సులోని 11 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని వీఎం బంజర్ పోలీసులు అంబులెన్స్‌లో పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి, పరిస్థితి విషమించగా ఉన్న ముగ్గురిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

దివ్యాంగుడి దారుణ హత్య

మద్యం సీసాలతో తలపై కొట్టి హతమార్చిన నిందితులు


బావ్‌సింగ్ (ఫైల్)

కామేపల్లి: ఓ గిరిజన యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన గురువారం అర్ధరాత్రి కామేపల్లి మండలం గోవిందాలలో చోటుచేసుకుంది. గోవింద్రాలకు చెందిన దివ్యాంగుడు ఆలోత్ బావ్‌సింగ్(33) తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో తన అక్క ఇంట్లో ఉంటూ చిన్నచిన్న పనులతో జీవిస్తున్నాడు. గురువారం రాత్రి ఆయన గ్రామానికి చెందిన కొందరితో మద్యం తాగేందుకు ప్రభుత్వ హైస్కూల్ ఎదురుగా ఉన్న మట్టి రోడ్డు వైపు వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం ఆ వైపు వెళ్లిన రైతులు రక్తపుమడుగులో పడి ఉన్న బావ్‌సింగ్‌ను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ చేరుకొని బావ్‌సింగ్ తలపై మద్యం సీసాలతో కొట్టి చంపినట్లు గుర్తించారు. ఖమ్మం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై మృతుడి అక్క అజ్మీరా మంగు ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు.

చెరువుమాధారంలో పోలీసు పికెట్

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నారు. ఇటీవల గ్రామంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా చెలరేగిన వివాదంపై పోలీసు అధికారులు ఇరువర్గాలతో చర్చించారు. దీంతో వివాదం సద్దుమణిగినప్పటికీ కొన్నాళ్లు పికెట్ కొనసాగించాలని నిర్ణయించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఓ యూట్యూబర్ గ్రామంలోని ఓ మతానికి చెందిన వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. ఈ నేపథ్యాన సోషల్ మీడియా వేదికగా సవాళ్లు, ప్రతిసవాళ్లు జరుగుతుండడంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్ ఇరువర్గాలతో చర్చించారు. ఆపై మళ్లీ ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతారనే భావనతో పికెట్ ఏర్పాటుచేశారు. శుక్రవారం కూడా కూసుమంచి సీఐ సంజీవ్ ఓ వర్గం ప్రతినిధులతో చర్చించి ప్రశాంత వాతావరణం కొనసాగేలా అందరూ సహకరించాలని సూచించారు.

స్త్రీనిధి రుణాల్లో అక్రమాలు

- రూ.68 లక్షల మేర వాడుకున్న ఆర్పీలు
- ఐపీ దాఖలుకు సిద్ధమవుతున్న ఓ ఆర్పీ

ఖమ్మంమయూరిసెంటర్: పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు మెప్మా ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను మంజూరు చేస్తున్నాయి. అయితే, స్త్రీనిధి ద్వారా మంజూరైన రుణాలను సభ్యులు సక్రమంగా చెల్లిస్తున్నా, ఈ నగదును బ్యాంకుల్లో జమ చేయకుండా కొందరు ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో స్త్రీనిధి అధికారులు, బ్యాంకర్లు నోటీసులు జారీ చేయగా ఒకరిద్దరు స్పందించినా, ఇంకొందరు మొండిగా వ్యవహరిస్తున్నారని సమాచారం.

6 వేల సంఘాలు

ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీల్లో 6వేల స్వయం సహాయక సంఘాలు, 246 సమాఖ్యలు ఉన్నాయి. ఖమ్మం నగరంలో రెండు పట్టణ సమాఖ్యలు, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో ఒక్కో సమాఖ్య కొనసాగుతున్నాయి. వీటి ద్వారా ఆయా సంఘాల్లోని సభ్యులకు స్త్రీనిధి రుణాలు ఇప్పిస్తుంటారు. తిరిగి సమాఖ్యలకు సభ్యులు చెల్లిస్తే ఆర్పీలు బ్యాంకుల్లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పక్కదారి పట్టిస్తున్నారని తెలుస్తుండగా, గతంలో నిర్వహించిన ఆడిట్‌లో 13 మంది అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు.

రూ.68 లక్షలు గోల్‌మాల్

స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను సంఘాల సభ్యులు నెలనెలా చెల్లిస్తున్నా కొందరు ఆర్పీలు, ఇంకొందరు సొంతానికి వాడేసుకున్నారు. గత నాలుగేళ్ల కాలంలో ఖమ్మం కార్పొరేషన్‌లో 12 మంది ఆర్పీలు రూ.66 లక్షలు, వైరాలో ఓ ఆర్పీ రూ.2 లక్షల వరకు వాడుకున్నట్లు తెలిసింది. అయితే, ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన సీసీలు, మెప్మా అధికారులు పట్టించుకోకపోవడం ఆర్పీలకు వరంలా మారిందని సమాచారం. కాగా, నోటీసులు అందుకున్న ఖమ్మంలోని 12 మంది ఆర్పీల్లో ఇద్దరు తిరిగి చెల్లిస్తున్నట్లు తెలిసింది. కానీ త్రీటౌన్ ప్రాంతానికి చెందిన ఓ ఆర్పీ మాత్రం భారీ మొత్తంలో నిధులు వాడుకున్నా తిరిగి చెల్లించలేను, అంతేకాక ఐపీ పెడుతానని చెబుతున్నట్లు శుక్రవారం ప్రచారం జరిగింది. కాగా, ఆర్పీల విషయంలో సీసీ(కమ్యూనిటీ కోఆర్డినేటర్)లు కమీషన్ తీసుకుని పట్టించుకోలేదని, ఇప్పుడు ఐపీ పెడతానంటున్నా సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ అంశంపై స్త్రీనిధి అధికారులను వివరణ కోరగా.. ఖమ్మం కార్పొరేషన్‌లో రుణాలను వాడుకున్నా ఆర్పీలకు నోటీసులు జారీ చేసి చేశామని తెలిపారు. అంతేకాక వారు రుణాలు చెల్లించేలా గురువారం జరిగిన సమావేశంలో సిబ్బందికి సూచించామని, లేకపోతే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉత్సాహంగా పర్యాటక దినోత్సవం


నృత్యం చేస్తున్న కళాకారులు

ఖమ్మం రాపర్తినగర్/నేలకొండపల్లి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలో అధికారులు శుక్రవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు విజ్ఞాన విహార యాత్ర కోసం నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రానికి తీసుకెళ్లారు. అక్కడ క్షేత్రం చరిత్ర, ప్రత్యేకతలను అవగాహన కల్పించగా జిల్లా పరిషత్ సీఈఓ దీక్షా రైనా, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి పాల్గొన్నారు. అలాగే, సాయంత్రం జిల్లా కేంద్రంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటకకంగా జిల్లా ప్రత్యేకతలు, త్వరలో జరగనున్న అభివృద్ధిని వివరించారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సమగ్ర సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య

చింతకాని: రైతులు సాగు చేస్తున్న పంటలను ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. మండలంలోని జగన్నాధపురం, తిమ్మినేనిపాలెం, తిరుమలాపురంల్లో వరి, పత్తి, మిర్చి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వరిని అగ్గి తెగులు, ఆకు చుట్టు పురుగుతో పాటు బ్యాక్టీరియా ఎండాకు తెగులుతో పాటు సుడిదోమ ఆశిస్తోందని తెలిపారు. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు కాపర్, శిలీంద్ర నాశినీ పిచికారీ చేయొద్దని సూచించారు. అలాగే, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఎకరంలో పెట్టాలని తెలిపారు. ఇక మిరప తోటలకు వేరుకుళ్లు, ఎండుతెగులు ఆశిస్తాయని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాములు లేదా కార్బండిజం ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద వేర్లు పూర్తిగా తడిచేలా పోయాలని సూచించారు. కాగా, రైతులు సేంద్రియ విధానాలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఏఓ తెలిపారు. ఏఓ పల్లెల నాగయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

ఒడిశా వాసిని కుటుంబానికి అప్పగించిన 'అన్నం'


అజిత్‌ను కుటుంబానికి అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి దారి తప్పి రాష్ట్రం దాటి ఖమ్మం చేరిన ఒడిశా వాసికి చికిత్స చేయించిన అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు శుక్రవారం తిరిగి కుటుంబానికి అప్పగించారు. గత నెల 17న ముదిగొండ మండలం బాణాపురం చెరువు వద్ద మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించారు. ఆయనను అన్నం ఆశ్రమానికి తీసుకురాగా సపర్యల అనంతరం మమత జనరల్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆయన తాజాగా కోలుకోగా తన పేరు అజిత్ కుమార్ సేనాపతి అని, ఒడిశా రాష్ట్రంలోని గబగన్ గ్రామవాసిగా చెప్పడంతో అక్కడి పోలీసుల ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. ఈమేరకు అజిత్ సోదరుడు ఖమ్మం రావడంతో మెప్మా పీడీ మహేందర్ ఆధ్వర్యాన అప్పగించారు.

కల్తీ.. చంద్రబాబు సృష్టి

శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని తేలుతోంది: వైఎస్ జగన్

''రాజకీయ దుర్బుద్ధితో, పచ్చి అబద్ధాలతో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి చంద్రబాబునాయుడే తప్పు చేశాడు. దీనిపై విచారణకు అయనే సిట్ వేస్తాడు. ఆయన చెప్పు చేతుల్లో ఉన్న అధికారులతో సిట్ అంటాడు. ఇదెక్కడి ధర్మం? ఇదెక్కడి పద్ధతి? చంద్రబాబు ఈ మాదిరిగా హిందూ ధర్మం మీద దుష్ప్రచారం చేస్తూ రాజకీయం చేయడం ధర్మమేనా? ఆలోచించండి''

''నేను తిరుపతికి వెళ్లకూడదట..! దేవుడిని దర్శించుకోకూడదట..! కారణం నా మతం అంటున్నారు. నాలుగు గోడల మధ్య నేను బైబిల్ చదువుతా. తప్పేముంది? బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తా, గౌరవిస్తా. ఇస్లాంను అనుసరిస్తా, గౌరవిస్తా. సిక్కిజమ్‌ను అనుసరిస్తా, గౌరవిస్తా. నా మతం ఏమిటని అడుగుతున్నారు.. నా మతం.. మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి''

''రాజ్యాంగం పీఠికలో ఏం చెప్పారు? ఇండియా ఈజ్ ఏ సావరిన్, సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్ (భారత్ సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం) సెక్యులర్ అంటే అర్థం తెలుసా? నీ మతం చెప్పకపోతే గుడిలోకి రావొద్దు అంటున్నావ్! ఇది సెక్యులర్ దేశం అంటున్నాం. సీఎంగా పని చేసిన వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక దళితులను గుడిలోకి పోనిస్తారా? రానిస్తారా?''

''మతం పేరుతో రాజకీయం చేయడం ఎంత దౌర్భాగ్యం? బీజేపీ నేతలు హిందుత్వానికి ప్రతినిధులుగా చెప్పుకుంటారు. మరి మీ కళ్లెదుటే మీ ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న వ్యక్తే శ్రీ వెంకటేశ్వరస్వామి విశిష్టతను, తిరుపతి లడ్డూ పేరు ప్రఖ్యాతులను, స్వామి వారి వైభవాన్ని దెబ్బతీసేలా సీఎం స్థాయిలో అబద్ధాలు చెబుతున్నారు. జంతువుల కొవ్వు వాడకపోయినా.. వాడి లడ్డూలు తయారు చేసినట్లుగా అబద్ధాలతో దుష్ప్రచారం చేసి వెంకటేశ్వరస్వామివారిని అపవిత్రం చేసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదు? ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే మీవాళ్లు ఏం చేసినా పరవాలేదు. మిగిలిన వారు ఏం చేసినా తప్పే! ఇదెక్కడి హిందుత్వం? హిందుత్వానికి మీరు టార్చ్ బేరర్స్ అంటారు. అందరూ ఆలోచించండి''

''హిందుత్వం అంటే మానవత్వం చూపడం..! మానవత్వాన్ని చూపలేని వారు మంచి హిందువునని చెప్పుకోలేరు''

''హిందుత్వంపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే టీటీడీ పేరు ప్రఖ్యాతులు మంట కలిపి ఘోరం చేసిన చంద్రబాబును ఎలా ఉపేక్షిస్తున్నారు? ఎందుకు బుద్ధి చెప్పడం లేదు? ఎందుకు మందలించడం లేదు? చేసింది మన వాడే అనుకుని వదిలేస్తే ఏం సందేశం ఇస్తున్నట్లు?. మళ్లీ ఘోరమైన తప్పులు జరగొద్దు. అందుకు చంద్రబాబును మందలించాలి. మతాన్ని, దేవుణ్ని రాజకీయాల్లోకి తేకుండా చంద్రబాబుకు సుప్రీం కోర్టు నుంచి, ప్రధాని నుంచి చీవాట్లు పడాలి. అప్పుడైనా ఈ మనిషికి జ్ఞానం కలుగుతుంది''

- వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఒక్కొక్కటిగా రుజువు అవుతూ కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా జూలై 23న ఈవో చెప్పిన రెండు నెలల తర్వాత సీఎం చంద్రబాబు సెప్టెంబరు 18న నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని పచ్చి అబద్ధాలాడారని మండిపడ్డారు. 'తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని ఎవరైతే అబద్ధాలతో అవమానించి అగౌరవపర్చాడో.. లడ్డూపై దుష్ప్రచారం చేశాడో.. ఆధారాలతో సహా కనిపిస్తున్న ఈ సత్యం బయటకు రావాలి. చంద్రబాబునాయుడు చేసిన ఈ పాపం కడగబడాలి. అది రాష్ట్ర ప్రజల మీదకు రావొద్దు. పాపం చేసిన చంద్రబాబు మీదే కట్టడి కావాలి. దాని కోసమే టాపిక్ డైవర్ట్ కాకూడదన్న ఉద్దేశంతో వెంకటేశ్వరస్వామిని ప్రేమించే వ్యక్తిగా, గౌరవించే వ్యక్తిగా నా పర్యటనను వాయిదా వేసుకున్నా'అని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని సాక్ష్యాధారాలతో కడిగి పారేశారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే..

డైవర్షన్ పాలిటిక్స్..: తన 100 రోజుల పాలన గురించి ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూల టాపిక్ తెచ్చారు. గుడి పవిత్రత దెబ్బతీస్తూ అడ్డంగా దొరికిపోయే సరికి లడ్డూల టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు కొత్తగా డిక్లరేషన్ అంశాన్ని తెచ్చి రాజకీయం చేస్తున్నారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టత, దేవస్థానం పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో రచ్చకీడ్చి రాద్ధాంతం చేశారు. జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్లుగా.. ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా.. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా.. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అబద్ధాలాడుతూ, అసత్యాలు పలుకుతూ స్వామి వారి పేరు ప్రఖ్యాతులను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే కార్యక్రమాన్ని సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రే చేస్తుంటే ఇంతకంటే దారుణం, అధర్మం ఎక్కడైనా ఉంటుందా? ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు ఏ రకంగా అబద్ధాలు చెప్పి రెక్కలు కట్టాడనేది ఆధారాలతో చూపిస్తా. దీన్ని రాష్ట్ర ప్రజలే కాదు.. దేశ ప్రజలంతా గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నా.


దశాబ్దాల ఆనవాయితీ..

తిరుమలలో లడ్డూల తయారీ కోసం నెయ్యి కొనుగోలు కార్యక్రమం దశాబ్దాలుగా జరుగుతోంది. ఆర్నెల్లకు ఒకసారి ఈ-టెండర్ పిలుస్తారు. అర్హులు బిడ్ వేస్తారు. ఎల్-1 గా వచ్చిన వారికి టెండర్ ఖరారు చేస్తారు. ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. ఎల్-1గా వచ్చిన వారికి కూడా పూర్తి టెండర్ ఖరారు చేయరు. 65 శాతం వారికిచ్చి మిగతా వారిని కూడా రేటు తగ్గించాలని సూచించి వారికి టెండర్ ఇస్తారు. నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. తిరుపతి లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ టేస్ట్ మరెక్కడా ఉండదు. తాము సూచించిన ప్రముఖులను టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమించాలని కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా రికమెండ్ చేస్తారు. అలాంటి ప్రముఖులతో బోర్డు ఏర్పాటవుతుంది. వారంతా దేవుడికి ఇంకా సేవ చేయాలని, భక్తులకు మంచి చేయాలని నిర్ణయాలు తీసుకుంటారు.

పటిష్ట సరఫరా వ్యవస్థ..: తిరుమలకు సరఫరా చేసే నెయ్యికి సంబంధించి రొబస్ట్ (పకడ్బందీ) విధానం ఉంటుంది. నెయ్యి సరఫరాదారులు ప్రతి ట్యాంకర్‌కు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) సర్టిఫై చేసిన క్వాలిటీ సర్టిఫికెట్ తేవాలి. అలా వచ్చిన నెయ్యిని కూడా ప్రతి ట్యాంకర్ నుంచి శాంపిల్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ట్యాంకర్‌ను ముందుకు పంపుతారు. ఒక్క టెస్టు ఫెయిల్ అయినా ట్యాంకర్‌ను తిరిగి వెనక్కి పంపిస్తారు. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో 14 నుంచి 15 ట్యాంకర్లు అలా వెనక్కి వెళ్లాయి. మా ప్రభుత్వ హయాంలో 18 ట్యాంకర్లు వెనక్కు పంపారు. అంటే ఎవరూ తప్పు చేయలేని విధంగా అక్కడ రొబస్ట్ విధానం ఉంది. ఏ సరుకులైనా సరే క్వాలిటీ టెస్టులో ఫెయిల్ అయితే వెనక్కు పంపిస్తారు.

వాడని నెయ్యి.. తయారుకాని లడ్డూ..

ఇప్పుడు కూడా అదే జరిగింది. టీటీడీ ట్రస్ట్ బోర్డు అనుమతించిన బిడ్డర్లు జూన్ 12 నుంచి సరఫరా మొదలుపెట్టారు. అంటే అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాతే నెయ్యి సరఫరా మొదలైంది. జూన్ 12, జూన్ 21, జూన్ 25, జూలై 4న వచ్చిన ట్యాంకర్లన్నీ టెస్టుల్లో పాస్ అయి ముందుకు కదిలాయి. వాటిని లడ్డూల తయారీలో వాడారు. ఆ తర్వాత జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 12న మరో రెండు ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి టీటీడీ టెస్టుల్లో ఫెయిల్ కావడంతో వెనక్కు పంపడానికి సిద్ధం చేశారు. సాధారణంగా మరోసారి ఆ శాంపిళ్లను పరీక్షించేందుకు మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారు. కానీ ఇక్కడ మాత్రం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్)కి పంపారు. ఇది టీటీడీ చరిత్రలో తొలిసారి. టీటీడీ పంపించిన శాంపిల్స్‌పై ఎన్‌డీడీబీ జూలై 23న రిపోర్ట్ పంపింది. నెయ్యిలో కల్తీ ఉందన్న విషయం చెప్పారు. దాంతో ఆ ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అలా 4 ట్యాంకర్లను వెనక్కు పంపడంతో పాటు ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మరి ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకపోయినా.. ఆ నెయ్యిని వాడారని రెండు నెలల తర్వాత సెప్టెంబరు 18న చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఎందుకు అన్నారు? (చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నియమించిన టీటీడీ ఈవో నెయ్యి నాణ్యత గురించి జూలై 23న ఏమన్నారో వీడియోను ప్రదర్శించారు). ఆ నాలుగు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం. షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా ఈవో చెప్పినా రెండు నెలల తర్వాత చంద్రబాబు సెప్టెంబరు 18న ఏ రకంగా అబద్ధాలు మాట్లాడారో చూడండి (ఆ వీడియో ప్రదర్శించి చూపారు). అన్నీ తెలిసినా.. నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు అబద్ధాలు చెప్పారు.



టీడీపీ ఆఫీస్‌లో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్..

చంద్రబాబు సెప్టెంబరు 18న ఆరోపణలు చేస్తే ఆ మర్నాడే.. అంటే సెప్టెంబరు 19న తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో ఎన్‌డీడీబీ రిపోర్ట్‌ను రిలీజ్ చేశారు. నిజానికి అది కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్. అయినా దాన్ని టీడీపీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు. ఆ వెంటనే మర్నాడు అంటే సెప్టెంబరు 20 టీటీడీ ఈవో మళ్లీ ఏం మాట్లాడారో చూద్దాం.. (ఆ వీడియోను ప్రదర్శించారు). ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని తేలినందువల్ల ఆ నెయ్యిని వెనక్కి పంపామని, వాడలేదని చెప్పారు. అంతే కాకుండా సెప్టెంబరు 22న ఈవో స్వయంగా సంతకం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా ఇచ్చారు (అందులోని అంశాలు చదివి వినిపించారు). కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కు పంపాం.. ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చాం.. ఎన్‌డీడీబీ రిపోర్టు చాలా గోప్యమని అందులో ప్రస్తావించారు. మరి దాన్ని అంతకు ముందే తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు.

అది అపవిత్రత కాదా?

మళ్లీ సెప్టెంబరు 22న మీడియాతో మాట్లాడిన చంద్రబాబు అవే పచ్చి అబద్ధాలు వల్లించారు. కల్తీ నెయ్యి వాడారని చెప్పారు. స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమల ప్రతిష్టను, శ్రీ వెంకటేశ్వరస్వామివారి ప్రసాదం పేరు ప్రఖ్యాతులను రాజకీయ లబ్ధి కోసం ఇలా అబద్ధాలతో తగ్గించడం, కుట్రపూరితంగా వ్యవహరించడం అపవిత్రత కాదా?

ఎన్‌డీడీబీ రిపోర్ట్ కచ్చితమైనది కాదు..

పోనీ.. ఆ ఎన్‌డీడీబీ రిపోర్టు అయినా కచ్చితమైందా? అని చూస్తే ఆ రిపోర్టులో వాళ్లే డిస్‌క్లెయిమర్ రాశారు. 'నెయ్యిలో ఉండాల్సిన స్టాండర్డ్ వాల్యూ కన్నా శాంపిల్స్‌లోని స్టాండర్డ్ వాల్యూస్‌లో డీవియేషన్స్ ఉన్నాయి. అయినా ఈ పరిస్థితుల్లో ఒక ఫాల్స్ పాజిటివ్ ఫలితం కూడా రావొచ్చు. (ఆ పరిస్థితులు ఏమిటంటే అని వివరిస్తూ పాల సేకరణ, ఆవులు, వాటికి అందించే దాణా గురించి ప్రస్తావించారు). అలాగే ఆవులకు సరైన ఆహారం లేనప్పుడు, అవి సరిగ్గా తినకుండా బలహీనంగా ఉన్నప్పుడు తీసిన పాల నుంచి కూడా ఇలాంటి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

పచ్చి అబద్ధాలు. అపవిత్రం కాదా?

ఇవన్నీ తెలిసినా చంద్రబాబు కావాలని అబద్ధాలాడుతున్నారు. ప్రసాదం స్వీకరించే ప్రతి ఒక్కరిలో అనుమానపు బీజాలు రేకెత్తించడం దుర్మార్గం కాదా? నీ రాజకీయ స్వార్థం కోసం వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను దిగజారుస్తున్నావు చంద్రబాబూ! స్వామి ప్రసాదానికి సంబంధించిన విశిష్టతను దిగజారుస్తున్నావ్. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వుతో ప్రసాదం తయారు చేసినట్లుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నావు. ఇది ధర్మమేనా?

మీ హయాంలో ఎందుకు వాడలేదు?

నందిని బ్రాండ్ ఎందుకు వాడడం లేదని అంటున్నారు. మరి గతంలో చంద్రబాబు పాలన సమయంలో 2015 నుంచి 2018 అక్టోబరు వరకు కేఎంఎఫ్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి ఎందుకు లేదు? అప్పుడు కూడా టెండర్లు పిల్చారు కదా?

అప్పుడు ఇంత కంటే తక్కువ ధరకే..

రూ.320కి కిలో నెయ్యి ఎలా వస్తుందని చంద్రబాబు అంటారు. మరి చంద్రబాబు 2014-19 మధ్య నెయ్యిని ఏ ధరకు సేకరించారు? ఇప్పుడు కూడా అదే క్వాలిటీ నెయ్యి కదా? దశాబ్దాలుగా అదే క్వాలిటీ. అదే నెయ్యి. చంద్రబాబు హయాంలో 2015లో కిలో నెయ్యి రూ.276కి కొన్నారు. అదే 2019 జనవరిలో కిలో ఆవు నెయ్యిని రూ.324కు కొన్నారు. మరి ఇక్కడ రూ.320కి కొంటే తప్పేం జరిగింది?

ఇది రాక్షస రాజ్యం కాదా?

''రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది.. దేవుడిని దర్శించుకునే కార్యక్రమాన్ని కూడా అడ్డుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నా రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస రాజ్యాన్ని రాష్ట్రంలోనే కాదు.. దేశంలో కూడా చూడలేదు''అని మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. (తిరుమల వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పోలీసులు ఇచ్చిన నోటీసులను ఈ సందర్భంగా ఆయన చదివి వినిపించారు). 'జగన్ అనే వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి. ఆయన దేవుడిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్తుంటే.. మీకు పర్మిషన్ లేదు.. మీరు వెళ్తే అరెస్టు చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. దీనిపై అందరూ ఒక్కసారి ఆలోచన చేయండి'అని విజ్ఞప్తి చేశారు. 'ఏ ప్రపంచంలో ఉన్నాం? ఇది రాక్షస రాజ్యం కాదా? ఒకవైపు నన్ను వెళ్లనివ్వకుండా చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెళ్లకుండా నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి బీజేపీ శ్రేణులను రప్పిస్తున్నారు. ఇది ఆ పార్టీ నాయకత్వానికి తెలుసో? లేదో? వేల మంది పోలీసులను మోహరించారు. టాపిక్ డైవర్షన్ కోసం ఎందుకింత ఆరాటం?'అని సీఎం చంద్రబాబును నిలదీశారు.

ప్రతి గుడిలో పూజలు చేయండి..

నేను గుడికి వెళ్లలేకపోయినా పరవాలేదు. కానీ చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మన పార్టీ తరపున మీ ఊళ్లలో పూజలు చేయండి. తప్పు చేసింది మేం కాదు.. చంద్రబాబు అని వేడుకోండి. ఆ కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపై చూపమని వేడుకోమని కోరుతున్నా. వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు.. రాష్ట్ర శ్రేయస్సు కాంక్షించే ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వరస్వామికి కోపం వచ్చి రాష్ట్రం మీద చూపకుండా, కోపం కేవలం చంద్రబాబుమీదే చూపించే విధంగా పూజలు చేయండి. ఎందుకంటే జరిగింది ఘోర అపచారం. వెంకటేశ్వరస్వామిని పలుచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వు వాడనిది వాడినట్లుగా, ఆ లడ్డూలు పంపిణీ చేసినట్లుగా.. పచ్చి అబద్ధాలాడుతూ ఇంత ఘోరం చేసిన వ్యక్తి చంద్రబాబు. ఆ పాపం కడగబడాలి. అందుకే అందరినీ కోరుతున్నా. పూజలు చేయమని వేడుకుంటున్నా.

నా డిక్లరేషన్ కోరడం ఏమిటి?

''చంద్రబాబు పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఆయన్ను వేలెత్తి చూపుతుండటంతో టాపిక్ డైవర్షన్ కోసమే డిక్లరేషన్ అంటున్నాడు. జగన్ ఇవాళ ఏమైనా కొత్తనా? రాజశేఖర్‌రెడ్డిగారు కొత్తనా? ఆయన ఏమిటో తెలియదా? నా మతం ఏమిటో రాష్ట్రంలో, దేశంలో తెలియదా? నా కులం ఏమిటో తెలియదా? రాజశేఖర్‌రెడ్డిగారు సీఎంగా 5 ఏళ్లు వరుసగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నేనూ గతంలో చాలాసార్లు వెళ్లాను కదా! సీఎం కాక ముందు కూడా వెళ్లాను కదా! అంతెందుకు.. నా పాదయాత్ర మొదలుపెట్టే ముందు కూడా స్వామివారిని దర్శించుకున్నా. 3,648 కిలోమీటర్ల పాదయాత్ర ముగిసిన తర్వాత తిరుపతి నుంచి కాలి నడకన కొండ ఎక్కా. స్వామివారిని దర్శించుకున్న తర్వాతే ఇంటికి వెళ్లా. అప్పుడు ఉన్నది చంద్రబాబు ప్రభుత్వం. నేను ప్రతిపక్ష నాయకుడిని. రెండు సార్లు స్వామివారిని దర్శించుకున్నాను కదా? ఆ తర్వాత సీఎంగా వరుసగా 5 ఏళ్లు స్వామివారికి భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించాను కదా? ఎన్నోసార్లు స్వామి వారిని దర్శించుకున్నా. తొలిసారి ఎవరైనా వెళ్తుంటే అడగొచ్చు. కానీ 10, 11 సార్లు వెళ్లిన తరువాత.. ఈరోజు నేను తిరుపతి వెళ్తానంటే అడ్డుకుంటూ నోటీసులు ఇవ్వడం ఏమిటి?. డిక్లరేషన్ అడగడం ఏమిటి? మా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు నోటీసులు పంపడం ఏమిటి?''అని వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

పోరాట యోధుడు.. కొండా

● ఐటీడీఏ పీఓ రాహుల్



బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఎనలేని పోరాట పటిమ చూపారని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పీఓ పూలమాలలు వేసి నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. కాగా, కామేపల్లి మండలం గోపాలపురం తండాకు చెందిన భూక్యా సునీల్‌కుమార్ భూపాల్ ఐఐటీలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతుండగా గిరిజన సంక్షేమ శాఖ తరపున ల్యాప్‌టాప్‌ను పీఓ అందజేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడడం ద్వారా మరికొందరికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, వివిధ విభాగాల అధికారులు రమణయ్య, భాస్కరన్, రవీంద్రనాథ్, తానాజీ, ఉదయ్‌కుమార్, మునీర్‌పాషా, అలివేలు మంగతాయారు, హరికృష్ణ, విద్యార్థి తల్లి లలిత తదితరులు పాల్గొన్నారు.

'క్లీన్ భద్రాద్రి' స్వాగతం పలకాలి

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంతో స్వాగతం పలికేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ, భద్రాచలం గ్రామపంచాయితీ స్పెషలాఫీసర్ బి.రాహుల్ అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న ఆయన కార్మికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిని నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం కార్మికులకు సేఫ్టీ మెటీరియ, కాస్మోటిక్ సామగ్రి పంపిణీ చేశారు. ఏపీఓ డేవిడ్‌రాజ్, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్‌తో పాటు రమ్య, సౌజన్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

బూడిద తరలింపునకు కమిటీ

పాల్వంచరూరల్: పాల్వంచలోని కేటీపీఎస్ నుంచి బూడిద(యాష్) తరలింపులో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కాలుష్య ప్రభావిత గ్రామాలైన సూరారం, పునుకుల, పుల్లాయిగూడెం, కరకవాగుతోపాటు యాష్‌పాండ్‌ను శుక్రవారం ఆయన కేటీపీఎస్ సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించి బూడిద తరలింపునకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. కేటీపీఎస్, ఐటీడీఏ అధికారులు త్వరలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి సమక్షాన సొసైటీ సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసి కమిటీ ద్వారా బూడిద తరలింపు బాధ్యతలను అప్పగిస్తామని పీఓ అన్నారు. కేటీపీఎస్ ఏడీఈ చలపతిరావు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

భాగస్వాముల ఆరోగ్యంపై శ్రద్ధ!



రక్తపరీక్షల కోసం నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

- ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలపై యాజమాన్యం దృష్టి
- ఉద్యోగుల జీవిత భాగస్వాములకు తొలిసారిగా వైద్యపరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబాలు
- ఖమ్మం రీజియన్‌లో మొదలైన హెల్త్ క్యాంపులు



బీపీ పరీక్షిస్తున్న టెక్నీషియన్

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్‌ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్యంపైనే కాకుండా.. వారి జీవిత భాగస్వామి ఆరోగ్యంపైనా యాజమాన్యం శ్రద్ధ చూపుతోంది. ఇప్పటి వరకు ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ క్యాంపుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అయితే పని ఒత్తిడి, ఇతర కారణాలతో ఉద్యోగులు వారి జీవిత భాగస్వామి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదని గుర్తించిన యాజమాన్యం మరో అడుగు ముందుకేసింది. ఇందులో భాగంగా జీవిత భాగస్వామికి పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు చేయించాలని నిర్ణయించగా.. ఖమ్మం రీజియన్‌లో వచ్చే నెల 23వరకు కొనసాగే హెల్త్‌క్యాంపులు గత సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి.

తొలిసారిగా..

సహజంగా ఓ సంస్థలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్యంపై యాజమాన్యాలు దృష్టి సారిస్తాయి. ఇందులో భాగంగానే ఆర్టీసీ రెండేళ్లుగా ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తూ, సమస్యలు గుర్తిస్తే చికిత్స అందిస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగుల జీవిత భాగస్వామికి సైతం వైద్యపరీక్షలు చేయిస్తుండడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఉద్యోగుల విధినిర్వహణలో తీరిక లేని పరిస్థితుల్లో తమ జీవిత భాగస్వామికి అనారోగ్య సమస్య వస్తే పరీక్షలు చేయించే వీలు చిక్కడం లేదు. ఈ నేపథ్యాన సంస్థ అధ్వర్యాన పరీక్షలు చేయిస్తుండడంపై హర్షణీయమని చెబుతున్నారు.

2,100 మందికి వైద్యపరీక్షలు

ఖమ్మం రీజియన్‌లో ఆర్‌ఎం కార్యాలయంతో పాటు ఏడు డిపోల పరిధిలో ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు ఇతర సిబ్బంది 2,100 మంది ఉన్నారు. గ్రాండ్ హెల్త్ క్యాంపు ద్వారా 2,100 మంది జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు చేయించనున్నారు. నెల పాటు ఈ క్యాంపులు ఖమ్మం రీజియన్‌లో కొనసాగుతాయి.

డిపోల వారీగా హెల్త్ క్యాంపులు వివరాలు

డిపో	క్యాంపు నిర్వహణ తేదీలు
ఖమ్మం	సెప్టెంబర్ 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు
మధిర	అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 3 వరకు
సత్తుపల్లి	అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 8 వరకు
భద్రాచలం	అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14 వరకు
మణుగూరు	అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 17 వరకు
కొత్తగూడెం	అక్టోబర్ 18 నుంచి అక్టోబర్ 21 వరకు
ఇల్లెందు	అక్టోబర్ 22 నుంచి అక్టోబర్ 23 వరకు

18 రకాల వైద్య పరీక్షలు

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాముల కోసం సంస్థ ఏర్పాటు చేసిన గ్రాండ్ హెల్త్ క్యాంపుల్లో 18 రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఈసీజీ, సీబీపీ, సిరం క్రియాటిన్, లిక్విడ్ ప్రొఫైల్, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలను ఈ క్యాంపులో చేస్తున్నారు. ఇవే పరీక్షలను ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో చేయిస్తే రూ.4వేలకు పైగా ఖర్చవుతుంది. కానీ సంస్థ ఉచితంగానే చేయిస్తోంది. ఈ శిబిరాల్లో పరీక్షలు చేయించాక ఏమైనా సమస్యలను గుర్తిస్తే వారిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించడంతోపాటు హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు.


నెల పాటు హెల్త్ క్యాంపులు..



ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ద్వారా వైద్యపరీక్షలు చేయించాం. అవసరమైన వారికి చికిత్స ఇప్పించాం. ఇప్పుడు ఉద్యోగుల జీవిత భాగస్వాములకు పరీక్షలు చేయించాలని ఎండీ నిర్ణయించడంపై హర్షం వ్యక్తమవుతోంది. రోజుకు 70మంది చొప్పున నెల పాటు పరీక్షలు నిర్వహిస్తాం.

– ఏ.సరిరామ్, ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్

అందరికీ సమాచారం ఇస్తున్నాం..



జీవిత భాగస్వాములకు హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించాలని ఉద్యోగులకు సమాచారం ఇస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో నాలుగు రోజులుగా డిపోలో గేట్ మీటింగ్‌ల నిర్వహించడమే కాక వ్యక్తిగతంగా ఫోన్ చేస్తున్నాం. పరీక్షల తర్వాత ఎవరికైనా సమస్యలు ఉన్నట్లు తేలితే చికిత్స ఇప్పిస్తున్నాం.

– డీ.ఎస్.రావు, కండక్టర్, హెల్త్ వలంటీర్, ఖమ్మం డిపో

మంచి నిర్ణయం..



ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి విధినిర్వహణతో తీరిక దొరకడం లేదు. జీవిత భాగస్వాముల ఆరోగ్యంపై ఆలోచించే సమయం ఉండడం లేదు. తొలిసారి ఉద్యోగులతో పాటు మాకు పరీక్షలు చేయించాలని నిర్ణయించడం శుభపరిణామం. ఏమైనా సమస్యలు ఉన్నట్లు తేలితే చికిత్స చేయించుకోవచ్చు.

– ఆర్.వీ.నారాయణమ్మ, ఖమ్మం

కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

- ప్రత్యేక చర్యలు చేపడుతున్న సింగరేణి
- ఇప్పటికే సీఎంపీఎఫ్, చికిత్స సౌకర్యం
- తాజాగా లాభాల్లో వాటా నుంచి రూ.5వేలు



ఆఫ్ లోడింగ్ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వర్తించే వీరు కొన్నాళ్లుగా సంస్థ తరఫున ఎలాంటి సౌకర్యాలకు నోచుకోలేదనే భావన ఉంది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కాంట్రాక్ట్ కార్మికులనూ పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే పరిగణిస్తూ వారి సంక్షేమానికి సంస్థ కృషి చేస్తోంది. సింగరేణిలో సులభ్ కార్మికులు, ఆఫ్ లోడింగ్, నర్సరీ, టిప్పర్ డ్రైవర్లతో పాటు సివిక్, సివిల్, హౌజ్‌కీపింగ్, వాటర్ సప్లయిస్, రైల్వే సైడింగ్, బెల్ట్ క్లీనింగ్, సెక్యూరిటీ, ఆఫీస్ నిర్వహణతో పాటు మొత్తంగా 56 విభాగాల్లోనూ కాంట్రాక్టు కార్మికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఏమేం సౌకర్యాలు...

- కార్మికులకు సీఎంపీఎఫ్‌గా 12శాతం వేతనంలో మినహాయిస్తే మరో 12 మరో శాతం సంస్థ జోడించి ఆర్థికంగా సహకారం అందిస్తోంది. అంతేకాక సీఎంపీఎఫ్ లెక్కలను ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం వెల్లడిస్తుండడంతో భరోసాగా ఉంటున్నారు.
- పర్మినెంట్ కార్మికులతో సమానంగా సింగరేణి వ్యాప్త 11 ఏరియాల ఆస్పత్రుల్లో కాంట్రాక్టు కార్మికులకూ వైద్య సౌకర్యం కల్పించారు.
- దీపావళి బోనస్ పర్మినెంట్ కార్మికులకు లమ్‌సమ్‌గా ఇస్తే, కాంట్రాక్టు కార్మికులకు మస్టర్‌కు రూ.54 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ విధానం కోలిండియాలో ఎక్కడా లేదు.
- గతంలో ఎన్నడూ లేనివిధంగా కంపెనీ సాధించిన ఆర్థిక సంవత్సరం లాభాల వాటాలో ప్రతీ కార్మికుడికి రూ.5వేలు చెల్లించాలని నిర్ణయించారు.
- క్యాంటీన్‌లో తక్కువ ధరతో టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

షరతులు లేకుండా వాటా..



సులభ్, ఆఫ్ లోడింగ్, నర్సరీ, గుట్కా షెడ్డు కార్మికులు, టిప్పర్ డ్రైవర్లకు కూడా లాభాల వాటాలో రూ.5వేల చొప్పున చెల్లించాలి. వీరిని మినహాయించాలనే ఆలోచన సరికాదు. అన్ని విభాగాల కార్మికులకు చెల్లిస్తేనే ఫలితముంటుంది.

– యాకూబ్‌షావలీ, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి



వేలాది క్వార్టర్లు అన్యాక్రాంతం అవుతున్నందున కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలి. తద్వారా సింగరేణి స్థలాల ఆక్రమణ జరగదు. ఇళ్ల అద్దె చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న మాకు క్వార్టర్లు కేటాయిస్తే మరమ్మతు చేయించుకుని నివసిస్తాం.

– నిర్మల, కాంట్రాక్ట్ కార్మికురాలు

అందంగా డైనింగ్ హాల్



ఖమ్మం కలెక్టరేట్‌లోని డైనింగ్ హాల్ కొత్త అందం సంతరించుకుంటోంది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచనలతో గోడలపై వివిధ రకాల కూరగాయలు, పండ్లు తదితర చిత్రాలను వేయిస్తున్నారు. చిత్రకారులు వీటిని అందంగా తీర్చిదిద్దుతుండడంతో డైనింగ్ హాల్ కొత్త రూపు సంతరించుకుంటోందని ఉద్యోగులు చెబుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్